క్లుప్తంగా

ఒంగోలుకు ఈసీహెచ్‌ఎస్ రిఫరల్ ఆస్పత్రి మంజూరు చేయాలి

● పార్లమెంట్‌లో ఎంపీ మాగుంట

ఒంగోలు: మాజీ సైనికులకు ఈసీహెచ్‌ఎస్ రిఫరల్ వైద్యశాలను ఒంగోలులో ఏర్పాటు చేయడంపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం పార్లమెంట్‌లో ప్రశ్న లేవనెత్తారు. రూల్ 377 కింద జీరో అవర్‌లో మాగుంట మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్ పరిధిలో 13,105 మంది మాజీ సైనికులు, 20 వేల మంది సైన్యంలో పనిచేస్తున్న వారు ఉన్నారన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల కంటే ప్రకాశం జిల్లాలోనే ఎక్కువ మంది సైన్యంలో ఉన్నారని తెలిపారు. వారిలో కూడా గిద్దలూరు నియోజకవర్గంలో వారు ఎక్కువని అన్నారు. జిల్లా కేంద్రానికి 145 కిలోమీటర్ల దూరంలో గిద్దలూరు ఉందని, చిన్న పట్టణమైనందున రిఫరల్ వైద్యశాల ఏర్పాటు చేయలేదని తెలిపారు. సైనికుల కుటుంబాల ఉపయోగార్థం ఎక్స్ సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (ఈసీహెచ్‌ఎస్) కింద ఒంగోలులో ఒక ఈసీహెచ్‌ఎస్ రిఫరల్ వైద్యశాల ఏర్పాటుకు పేర్నమిట్ట వద్ద 443/1 సర్వే నంబర్‌లో 37 సెంట్ల స్థలాన్ని మంజూరు చేసేందుకు కలెక్టర్ సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ఈ స్థలాన్ని ఇప్పటికే తహసీల్దారు, ఆర్డీవోలు కూడా పరిశీలించినట్లు తెలిపారు. అంతేగాకుండా తక్షణమే వైద్య సేవలు ప్రారంభించేందుకు భవనం కూడా సిద్ధంగా ఉందన్నారు. ఈసీహెచ్‌ఎస్ అందుబాటులో లేని కారణంగా దాదాపు 158 మంది మాజీ సైనికులు కోవిడ్‌లో మరణించారని, అందువలన ఒంగోలుకు ఈసీహెచ్‌ఎస్ రిఫరల్ ఆస్పత్రిని ప్రాధాన్యత క్రమంలో మంజూరు చేయాలని కేంద్ర రక్షణ శాఖామంత్రికి విజ్ఞప్తి చేశారు.

అవార్డు అందుకున్న మాధవరావు



మాధవరావును సత్కరిస్తున్న లిటిల్ చాంప్స్ అకాడమీ నిర్వాహకులు

చీమకుర్తి: అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో కే విశ్వనాథ్ జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన లిటిల్ చాంప్స్ అకాడమీ వారి చేతుల మీదుగా మాధవరావుకు అవార్డు అందించారు. అభయ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాధవరావు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేసినట్లు తెలిపారు.

చేతుల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



చేతులు పరిశుభ్రం చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కొత్తపట్నం: చేతులు శుభ్రం చేసుకుని ఆహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో మల్లేశ్వరి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం డెటల్ బనాగా స్వస్థ ఇండియా గ్రామాలయ సాడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బందికి హేండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ గ్రామంలో కమ్యూనిటీ స్థాయిలో చేతులు-శుభ్రత, ఆరోగ్యం అంశాలపై అవగాహన కల్పించారు. కొంతమందిలోనైనా మార్పు తేవాల్సిన బాధ్యత మనమీద ఉందన్నారు. పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వ్యక్తిగత పరిశుభ్రత అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు

కొత్తపట్నం: యువకుడు అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపట్నం మండలం గాదెపాలెం గ్రామానికి చెందిన గద్దె సుబ్బయ్య ఈ నెల 8న టాపీ పనికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. భార్య దైవకృప స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై కొక్కిలగడ్డ మధుసూదన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఒంగోలు: స్థానిక అగ్రహారం రైల్వే గేటు వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. మృతుని వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటుంది. ఒంగోలు నుంచి టంగుటూరు వైపు వెళ్లే రైల్వే ట్రాక్‌పై మృతదేహాన్ని గుర్తించారు. తెలుపు రంగు అర చేతుల చొక్కా ధరించి ఉన్నాడు. మృతుని చేతికి కాషాయ రంగు కలిగిన కాశీతాడు ఉంది. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఒంగోలు జీఆర్‌పీ ఎస్సై నరసింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి సంబంధించి ఆధారాలు లభ్యమైన వారు పూర్తి వివరాలకు 94905 66577, 94946 84304 సెల్ నంబర్లను సంప్రదించాలని రైల్వే పోలీసులు సూచించారు.

ఓటమి భయంతోనే అలజడి

● పక్కా పథకం ప్రకారమే టీడీపీ నాయకులు ఆ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టారు
● అందులో భాగంగానే మహిళలపై నిందలు వేస్తున్నారు
● అధికార అహంకారం ఏంటో టీడీపీ హయాంలోనే ఒంగోలు ప్రజలు చూశారు
● దామచర్ల జనార్దన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలి
● ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత హితవు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ గంగాడ సుజాత, పాల్గొన్న కార్పొరేటర్లు

ఒంగోలు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకునేందుకు పట్టభద్రులు ముందుకు రావడం సహించలేకే పోలింగ్ కేంద్రాల వద్ద ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఉద్రిక్తతలకు ఆజ్యం పోశారని నగర మేయర్ గంగాడ సుజాత విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 13న సెయింట్ థెరిస్సా పోలింగ్ కేంద్రం వద్ద రాజ్యాంగబద్ధంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పట్టభద్రులు వస్తున్న తరుణంలో కావాలని తొడలు కొట్టి, మీసాలు మెలేస్తూ టీడీపీ కార్యకర్తలు చేసిన చర్యలను ప్రజలంతా చూస్తూనే ఉన్నారన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతున్న వేళ తొడలు కొట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందన్నారు. ఇతర పార్టీల వారి వద్దకు వచ్చి మీసాలు మెలేస్తూ చాలెంజ్ చేస్తుంటే కార్యకర్తలు సహిస్తూ ఉంటారా..? అని ప్రశ్నించారు. ఇది కేవలం పథకం ప్రకారం కార్యకర్తల ద్వారా జనార్దన్ ఉద్రిక్తతలు సృష్టించారని మండిపడ్డారు. అందుకు భిన్నంగా ప్రెస్‌మీట్లు పెట్టి బాలినేనిపై వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేసినా చట్ట ప్రకారం కేసులు పెట్టామే తప్ప ఎక్కడా చట్ట వ్యతిరేక చర్యలకు తాము పాల్పడలేదన్నారు. కానీ, పోలీస్‌స్టేషన్‌లోకి దౌర్జన్యంగా వెళ్లి పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తులను బయటకు తీసుకెళ్లడం రౌడీయిజం అనిపించుకుంటుందా.. లేక పోలింగ్ బూత్‌ల వద్ద పోలింగ్ సరళిని పరిశీలించడం రౌడీయిజం అవుతుందా సమాధానం చెప్పాలని నిలదీశారు. కార్లు, కార్యకర్తలతో పోలింగ్ కేంద్రాల వద్ద హల్‌చల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలనుకోవడం రాజకీయ నాయకుని లక్షణం కాదంటూ మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి మాట్లాడుతూ పక్కా పథకం ప్రకారం రెచ్చగొట్టి ఉద్రిక్తతలు సృష్టించడమే కాకుండా.. బాలినేని కారులో మహిళా నాయకులు ఉండి కారం పొట్లాలు పట్టుకుని తిరిగారని ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చేతనైతే నిరూపించు.. లేదంటే రాజకీయాల నుంచి తప్పుకో అంటూ దామచర్లకు సవాల్ విసిరారు. మహిళలపై కనీస గౌరవం కూడా లేకుండా ఇష్టం వచ్చినట్లు నిందలు వేస్తే అదే మహిళాలోకం తగు రీతిలో మరోమారు గుణపాఠం చెప్పేందుకు సిద్ధమవుతుందన్నారు. వ్యక్తిగత విషయాలను పదేపదే ప్రస్తావిస్తుంది, అల్లూరులో వ్యక్తిగత విషయాన్ని బాలినేనికి ఆపాదించాలని చూసి అభాసుపాలైంది టీడీపీ వారేనన్న విషయం ఒంగోలు ప్రజానీకం మొత్తానికి తెలుసన్నారు. కమ్మపాలెంలో మీరు ఎంత దౌర్జన్యం చేసింది, ఒక పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకోకుండా అడ్డుపడింది కూడా అందరికీ తెలిసిన విషయమేనన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ వారే నగరంలో భారీ కాన్వాయ్‌లతో ఎలా సంచరించారో, అధికార అహంకారాన్ని ఎలా ప్రదర్శించారో ప్రజలు చూశారని, అందువలనే తగురీతిలో గుణపాఠం చెప్పారని విమర్శించారు. కార్పొరేటర్ గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ మాట్లాడుతూ ఒక బీసీ మహిళ చీర లాగేసి జాకెట్ చింపి టీడీపీ కార్యకర్తలు చేసిన బీభత్సాన్ని ఖండించాల్సిందిపోయి.. మళ్లీ తప్పుడు కేసులంటూ ఆరోపించడమేనా బీసీలకు టీడీపీ పార్టీ ఇచ్చే కానుక అంటూ నిలదీశారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి

● జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి



వర్మీకంపోస్టు షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీవో నారాయణరెడ్డి

ఒంగోలు రూరల్: గ్రామాల్లో నూరుశాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని సర్వేరెడ్డిపాలెం గ్రామాన్ని బుధవారం ఆకస్మికంగా ఆయన సందర్శించారు. గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్మీకంపోస్టు తయారీ విధానాన్ని, తయారైన వర్మీకంపోస్టు ఎరువును నిశితంగా పరిశీలించారు. వేగంగా ఎక్కువ మొత్తంలో వర్మీకంపోస్టు తయారీకి, ఎక్కువ పిట్స్‌లో వర్మీకంపోస్టు తయారీకి పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. షెడ్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం కేంద్రం వద్ద తీగజాతి మొక్కలను డీపీవో నాటారు. అనంతరం గ్రామంలో ఇంటి పన్నుల వసూళ్ల కోసం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌ను తనిఖీ చేశారు. ఇంటి పన్నుల వసూళ్లపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. స్పెషల్ డ్రైవ్‌లో స్వయంగా డీపీవో పాల్గొన్నారు. ఈ నెల 31లోగా నూరు శాతం పన్నులు వసూలు చేయాలని స్థానిక అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నా.. తాగునీటి అవసరాలు తీర్చాలన్నా.. వీధిదీపాలు నిర్వహించాలన్నా ఆర్థిక వనరులు ఇంటి పన్నులేనని, వాటిని సకాలంలో చెల్లించాలని ప్రజలను కోరారు. గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా పన్నుల వసూళ్లపై అవగాహన కల్పించడంతో పాటు వసూళ్ల కార్యక్రమాన్ని నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వసూలు చేసిన మొత్తాన్ని వెంటనే పంచాయతీ ఖాతాకు జమ చేసి సదరు విషయాన్ని జిల్లా కార్యాలయానికి తెలపాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, కార్యదర్శి రామ్మోహన్‌రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత బహుజన రాజ్యాధికార దిక్సూచీ.. కాన్షీరాం



కాన్షీరాంకు నివాళులర్పిస్తున్న చప్పిడి వెంగళరావు, తదితరులు

ఒంగోలు: దళిత బహుజన రాజ్యాధికార దిక్సూచీ.. కాన్షీరాం అని దళిత బహుజన ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అన్నారు. కాన్షీరాం 89వ జయంతిని స్థానిక దళిత సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చప్పిడి వెంగళరావు మాట్లాడుతూ రాజ్యాధికారానికి చేరుకోలేని జాతులు అంతరిస్తాయని పేర్కొంటూ ఉత్తరప్రదేశ్‌లో దళిత బహుజన రాజ్యాధికారాన్ని కాన్షీరాం తీసుకొచ్చారన్నారు. బహుజన సమాజ్ పార్టీని స్థాపించి మాయావతికి పాలనాపగ్గాలు అప్పగించారన్నారు. అత్యల్పశాతం ఉన్న అగ్రకులాల నేతలు అధికారం కోసం ప్రజల మధ్య యాత్రలు చేస్తుంటే దళిత బహుజనులు మాత్రం సామాజిక మాధ్యమాల వేదికగా కార్యక్రమాలు కొనసాగిస్తుండటం బాధాకరమన్నారు. 1980వ దశకం నుంచే కాన్షీరాం కాలినడకన, సైకిల్ మీద ఊరూరు తిరిగి దళిత బహుజనుల్లో రాజ్యాధికార చైతన్యాన్ని రగిలించి జెండా ఎగురవేశారని, దానిని స్ఫూర్తిగా తీసుకోవాలని దళిత బహుజనులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, యానాది మహానాడు జిల్లా అధ్యక్షుడు తలపల శ్రీనివాసరావు, ఐక్యవేదిక నాయకులు పెద్దపూడి బాబు, గర్నెపూడి సుబ్బారావు, బీసీ సంక్షేమ సంఘ నాయకులు మోరపాకుల కృష్ణ, పాటికలపూడి జయరాం తదితరులు పాల్గొన్నారు.

19 మంది అడ్మిన్లకు చార్జ్ మెమోలు

● పన్నుల వసూలులో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు జారీ
● 15 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా.. 50 శాతం కూడా వసూలు చేయని వారిపై చర్యలు
● వీడియో కాన్ఫరెన్స్‌లో ఆగ్రహం వ్యక్తం చేసిన నగర కమిషనర్ వెంకటేశ్వరరావు



వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థలో పన్నులు వసూలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలకు చార్జ్ మెమోలు జారీ చేసినట్లు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం తన చాంబర్ నుంచి నగరంలోని 70 వార్డు సచివాలయాల అడ్మిన్లతో కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వార్డు సచివాలయాల వారీగా పన్నుల వసూళ్ల జాబితాలు చదివి వినిపించిన కమిషనర్.. 50 శాతంలోపు పన్నులు వసూలు చేసిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నులు వసూలు చేయడంలో ఇబ్బందులేమైనా ఉంటే ముందుగానే తన దృష్టికి తీసుకురావాలని, గత రెండుమూడు నెలలుగా చెబుతున్నా పట్టీపట్టనట్లు వ్యవహరించటం బాధ్యతా రాహిత్యమని అన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు మొత్తం కలిపి డిమాండ్ రూ.40,91,05,497గా ఉందన్నారు. అందుకుగానూ ఇప్పటి వరకు కేవలం రూ.23,25,97,589 మాత్రమే వసూలు చేశారని గుర్తు చేశారు. అంటే ఇప్పటి వరకు కేవలం 56.8 శాతం మాత్రమే వసూలు చేసినట్లని, ఇంకా రూ.17,65,07,90 బకాయిలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధంగా అయితే.. నగరంలో ప్రజలకు మౌలిక వసతుల కల్పన ఏ విధంగా సాధ్యమవుతుందని మండిపడ్డారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగింపునకు కేవలం 14 రోజులు మాత్రమే ఉందన్నారు. మిగతా మొత్తం వసూలు సాధ్యమేనా అని అడ్మిన్ సెక్రటరీలను నిలదీశారు. కొంతమంది బాగానే చేశారని పేర్కొన్నారు. ఆర్‌డీఎంఏ నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయని, ఇక నుంచి ప్రతి రోజూ సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బకాయిలున్న ఇళ్లను సందర్శించి మరీ వసూలు చేయాలని ఆదేశించారు. ఈ 14 రోజులూ పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కమిషనర్ సూచించారు. పెండింగ్ ఉన్న వారికి లాయర్ నోటీసులు కూడా ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. పన్నుల వసూలులో నిర్లక్ష్యంగా వ్యవహరించి 50 శాతం లోపు పన్నులే వసూలు చేసిన 19 మంది అడ్మిన్ సెక్రటరీలకు చార్జ్ మెమోలు జారీ చేశారు. సమావేశంలో ఆర్వో తుపాకుల మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

చీమకుర్తి: విద్యుత్ శాఖ దర్శి డివిజన్‌లోని మర్రిచెట్లపాలెం సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్‌కు చెందిన 40 బృందాలు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాయి. 3,500 విద్యుత్ సర్వీసులను పరిశీలించగా, వాటిలో 14 సర్వీస్‌లు అదనపు లోడుతో కరెంటు వాడుకుంటున్నట్లు గుర్తించారు. మరో సర్వీస్ యజమాని దొంగతనంగా కరెంటు వాడుకుంటున్నట్లు గుర్తించారు. వారి నుంచి రూ.85 వేల అపరాధ రుసుం వసూలు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. విజిలెన్స్ ఈఈ తోట శ్రీనివాసరావు, దర్శి ఈఈ సయ్యద్ అబ్దుల్ కరీం, డీఈలు గురునాథ్, పిచ్చయ్య, శ్రీనివాసులు, దర్శి డివిజన్‌లోని ఏఈలు దాడుల్లో పాల్గొన్నట్లు చీమకుర్తి ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

వరిగడ్డి దగ్ధం

మద్దిపాడు: వరిగడ్డి దగ్ధమై రూ.30 వేల ఆస్తి నష్టం సంభవించిన సంఘటన బుధవారం తెల్లవారుజామున మద్దిపాడులోని అంకమ్మ తల్లి గుడి వద్ద చోటుచేసుకుంది. అడపాల శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం రూ.30 వేల విలువైన వరిగడ్డి కొనుగోలు చేసి తన స్థలంలో దించుకున్నాడు. బుధవారం వామి వేయించడానికి కూలీలను కూడా మాట్లాడుకున్నాడు. కానీ, తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో కొందరు వ్యక్తులు వరిగడ్డిని తగలబెట్టారని, స్థానికుల సహాయంతో మంటలు ఆర్పడానికి ప్రయత్నించడంతో పాటు ఒంగోలు ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పిందని బాధితుడు తెలిపాడు. రూ.30 వేల నష్టం సంభవించిందని మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఒంగోలు అడిషనల్ జిల్లా ఫైర్ ఆఫీసర్ యు.శ్రీనివాసరెడ్డి తన సిబ్బంది, స్థానికుల సహాయంతో మంటలు ఆర్పివేశారు.

బాలల హక్కులకు ప్రాధాన్యత ఇవ్వండి

● పదో తరగతి పరీక్షల నిర్వహణలో పెద్దపీట వేయండి
● బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి

ఒంగోలు: ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల నిర్వహణలో బాలల హక్కులకు పెద్ద పీట వేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో విద్యాశాఖ అధికారితోపాటు పలువురు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో వెలుతురు, మౌలిక సదుపాయాలు ఉండేలా చూడటంతో పాటు దివ్యాంగులకు అవసరమైన సహాయక చర్యలు కూడా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఫ్యాన్లు, తాగునీటి వసతితో పాటు వేసవిని దృష్టిలో ఉంచుకుని వైద్య సేవలు కూడా ప్రతి పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే వాహనాలపై ఆంక్షలు విధించకుండా రద్దీ కూడళ్లలో ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా పోలీసుశాఖ సహకారం తీసుకోవాలన్నారు. ఆర్టీసీ కూడా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా బస్సులు ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులతో మాట్లాడాలన్నారు. టోల్‌ఫ్రీ, హెల్ప్‌డెస్క్ వివరాలపై ఇప్పటి నుంచే ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఏ ఒక్క పిల్లవాడు అసౌకర్యంగా పరీక్షలు రాయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పి.రమేష్ మాట్లాడుతూ ఏ ఒక్క విద్యార్థి ఇబ్బంది పడకుండా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పరీక్షలు నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మొత్తం 28,902 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు డీఈవో తెలిపారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ కమిటీ సభ్యురాలు డి.నీలిమ, బాలల పరిరక్షణ అధికారి పి.దినేష్, సోషల్, బీసీ, ఎస్టీ వెల్ఫేర్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ అధికారులు హాజరయ్యారు.

వీవోఏ ఓవరాక్షన్!



ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనం



ప్రభుత్వ భవనంలో నిర్వహిస్తున్న వెల్‌నెస్ సెంటర్

● ప్రభుత్వ భవనంలో ప్రైవేటు కార్యకలాపాలకు అనుమతి
● అద్దెకు ఇచ్చినట్లు ఆరోపణలు

నాగులుప్పలపాడు: అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లుంది ఉప్పుగుండూరులోని మహిళా బ్యాంకు కమిటీ తీరు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి, వారి సాధికారతకు ఉపయోగపడే విధంగా 2004 సంవత్సరంలో ఎంపీ నిధులతో గ్రామంలో ఓ ప్రభుత్వ భవనం నిర్మించారు. అప్పటి నుంచి ఈ భవనం డీఆర్‌డీఏ ఆధీనంలో ఉంటూ డ్వాక్రా మహిళల సమావేశాలు, సభలు లాంటివి జరుపుకోవడానికి ఉపయోగపడుతోంది. ఈ క్రమంలో ఇప్పటికే ఈ మహిళా బ్యాంకులో 25 సంఘాలు సభ్యులుగా ఉండటంతో పాటు కమిటీ కూడా నిర్వహిస్తున్నారు. ప్రస్తుత కమిటీలో సభ్యురాలిగా ఉన్న గ్రామ వీవోఏ జాలాది అరుణ ఆ భవనాన్ని ప్రైవేటు వెల్‌నెస్ సెంటర్‌కు అద్దెకిచ్చింది. ప్రస్తుతం ఆ మహిళా బ్యాంకు ప్రాంగణంలో వెల్‌నెస్ సెంటర్‌ను దాని నిర్వాహకులు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ భవనంలో ప్రైవేట్ కార్యకలాపాలు కొనసాగించడంపై పలువురు ప్రశ్నించగా, జాలాది అరుణ తమకు అద్దెకిచ్చిందని వెల్‌నెస్ సెంటర్ నిర్వాహకులు చెప్పారు. ప్రభుత్వ భవనాన్ని ప్రైవేటు సంస్థలకు అద్దెకివ్వడంపై డీఆర్‌డీఏ పీడీ బాబూరావును వివరణ కోరగా, ఆ భవనం తమ ఆధీనంలోనే ఉందని, దానిని మహిళా సంఘాల అభ్యున్నతి కోసం ఉపయోగించుకోవాలే తప్ప.. ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు ఇవ్వడం సరికాదని అన్నారు. దీనిపై విచారణ జరిపి అద్దెకిచ్చిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు.

వీఏఏ కుటుంబానికి అధికారుల పరామర్శ

ఒంగోలు రూరల్: మండలంలోని దేవరంపాడు సచివాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ)గా పనిచేస్తున్న తేళ్ల విల్సన్ (24) మంగళవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బుధవారం అధికారులు పరామర్శించారు. మంగళవారం ఉదయం సచివాలయంలో విధులకు హాజరైన విల్సన్.. దేవరంపాడు క్లస్టర్‌లోని బొద్దులూరివారిపాలెం రైతు భరోసా కేంద్రానికి వెళ్లి కొంతసేపు విధులు నిర్వర్తించాడు. ఆ తర్వాత తనకు బాగోలేదంటూ ఒంగోలు వెళ్లిపోయాడు. ఇంటికి వెళ్లి పడుకుని గుండెపోటుతో మృతి చెందాడు. ఒంగోలు మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబు, ఎంపీఈవోలు రామకృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, తదితరులు బుధవారం విల్సన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు కార్యదర్శులు, వ్యవసాయశాఖ సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. విల్సన్‌కు తల్లి, చెల్లి ఉన్నారు. ఇంకా వివాహం కాలేదు.

రేపు జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఎమర్జ్-2023

మార్కాపురం: స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 17,18 తేదీల్లో జాతీయ స్థాయి ఎమర్జ్-2023ను నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ తెలిపారు. బుధవారం కళాశాలలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 18న జాతీయ సాంకేతిక కల్చరల్ సదస్సు కూడా నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ పీపీఎస్ నాయక్, ప్రొఫెసర్ ఆది సత్యనారాయణలు కన్వీనర్‌లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. జేఎన్‌టీయూ కాకినాడ, వివిధ కళాశాలల నుంచి ప్రొఫెసర్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవాలు

● సందడి నెలకొన్న వెలుగొండ తిరునాళ్ల
● గరుడ వాహనంపై శ్రీవారి ఉత్సవం



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు



శ్రీవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం తిరునాళ్ల కావడంతో వెలుగొండలో భక్తులతో బ్రహ్మోత్సవ సందడి నెలకొంది. క్యూలైన్లో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు పల్లకిలో అలంకరించిన గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారిని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళాలతో వెలుగొండ పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదాతలుగా కూనపల్లి శేషఫణిశర్మ, ప్రసాదశర్మ, దూర్జటిశర్మ, వీరభద్రశర్మ, శ్రీకాంతశర్మ, రామచంద్ర పవన్ కుమార్, శాంతమూర్తి, జానకీరామ్ దంపతులు వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తల పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగాయి. వేదపండితులు ప్రసాదాచార్యులు, పవన కుమార్‌శర్మ స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అన్ని కులాల అన్నదాన సత్రాల్లో అన్నదానం చేశారు. గురువారం మోహినీ ఉత్సవం, గజోత్సవం, తిరునాళ్ల, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే ఉడుముల పూజలు

తిరునాళ్లను పురస్కరించుకొని బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ గీతికారెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీవారిని కోరుకున్నట్లు ఉడుముల స్పష్టం చేశారు. ఆలయ వేదపండితులు, ఆలయ ఈఓ, చైర్మన్‌లు నాయకులను సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.